సాక్షి
మంచిర్యాల
బుధవారం : 13 : డిసెంబర్ : 2023



రూ.10కరెన్సీ నోట్ల కొరత
మార్కెట్లో రూ.10 కరెన్సీ నోట్ల కొరత తీవ్ర సమస్యగా మారింది. ఎక్కడ రూ.20 నోటు ఇచ్చినా తిరిగి పది రూపాయలు ఇవ్వాలంటే లేదు అనే పరిస్థితి ఎదురవుతోంది. 8లో▸



మిర్చికి తెగులు... రైతుల్లో గుబులు
మిర్చి పంటకు తెగుళ్లు సోకుతున్నాయి. ప్రస్తుతం చెట్లు పూత, కాత దశలో ఉన్నాయి. పంటకు తెగుళ్లు సోకడంతో ఆకులు ముడుచుకుని మొక్కల పెరుగుదల తగ్గింది. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
28.0 /15.0
ఉదయం వేళ ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రి పూట పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

'పెద్దపల్లి లోక్‌సభ స్థానంలో గెలుపే లక్ష్యం'



సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథ్

లక్సెట్టిపేట: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంటు స్థానం గెలుపే లక్ష్యంగా బీజేపీ పని చేస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐబీ గెస్ట్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఆదరించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో మరోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం లక్ష్యంగా పని చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీష్ జైన్, పట్టణ అధ్యక్షుడు హరిగోపాల్, మండల అధ్యక్షుడు కిషన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్, మధు, కిరణ్, మల్లయ్య, సతీశ్, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వంటగ్యాస్ కేవైసీ కోసం బారులు



బెల్లంపల్లిలో బారులు తీరిన లబ్ధిదారులు

నెన్నెల: వంటగ్యాస్ లబ్ధిదారులు ఈకేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. గ్యాస్ కనెక్షన్ ఎవరి పేరిట ఉంది, వాడుతున్నారా లేదా ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారా అనేది తెలుసుకోవడానికి ఈకేవైసీ అవసరం. ఇందుకు ఎలాంటి గడువు లేదని ఆయా కంపెనీలు పేర్కొంటున్నాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఒకటైన రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ పథకానికి అర్హులు కావాలంటే ఈ నెల 31లోపు ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవాలనే ప్రచారం జరుగుతోంది. దీంతో గ్యాస్ వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల ఎదుట బారులు తీరుతున్నారు. గత కొన్ని రోజులుగా నెన్నెల, భీమిని, కన్నెపల్లి మండలాల నుంచి మహిళలు బెల్లంపల్లి గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల ఎదుట గంటల కొద్దీ బారులు తీరి కనిపిస్తున్నారు. గ్యాస్ కనెక్షన్ కలిగిన యజమాని నుంచి ఆధార్‌కార్డు, గ్యాస్ కనెక్షన్ నంబరు ఆధారంగా వేలిముద్రలు రాకుంటే ఐరిష్ తీసుకుని అప్‌డేట్ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ పథకానికి, ఈకేవైసీకి సంబంధం లేదని, ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతుందని గ్యాస్ ఏజెన్సీల మేనేజర్లు పేర్కొంటున్నారు.

దిగుబడుల అంచనాకే పంట కోత ప్రయోగం

- జిల్లా కలెక్టర్ సంతోష్



పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

దండేపల్లి: పంట దిగుబడులు అంచనా వేసేందుకే పంట కోత ప్రయోగాన్ని చేపట్టినట్లు కలెక్టర్ బి.సంతోష్ తెలిపారు. మండలంలోని రొల్లపహాడ్ శివారులో మంగళవారం పంట కోత ప్రయోగాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలతో పంట దిగుబడులు అంచనా వేసి వాటి వివరాలను ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. జిల్లా వ్యసాయ అధికారి కల్పన, ప్రణాళిక అధికారి సత్యం, తహసీల్దార్ సంధ్యరాణి, ఏవో అంజిత్‌కుమార్, ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనుగోళ్లు సజావుగా చేపట్టాలి
దండేపల్లి/లక్సెట్టిపేట: వరి ధాన్యం కొనుగోళ్లను సజావుగా చేపట్టాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్, రెబ్బనపల్లి, లక్సెట్టిపేట మండలం కొత్తూరు, రాపల్లి, గుల్లకోట, లక్ష్మీపూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతుల నుంచి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. ధాన్యాన్ని బస్తాకు దాదాపు 41 కిలోలు మాత్రమే తూకం వేయాలని, అంతకన్న ఎక్కువగా తూకం వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ గోపాల్, అధికారులు రాజన్న, మధుసూదన్ పాల్గొన్నారు.

రెట్టింపు ఆశ నిండా ముంచింది..!

- ఓ కంపెనీలో ప్రభుత్వ టీచర్ల ద్వారా చేరికలు
- రూ.8కోట్లు సర్కారు ఉద్యోగుల పెట్టుబడులు
- యజమాని అరెస్టుతో బయటపడ్డ వైనం

"ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు నా వద్దకు వచ్చి హైదరాబాద్‌కు చెందిన కంపెనీలో పెట్టుబడి పెడితే లాభాలు ఆర్జించవచ్చని చెప్పాడు. రూ.లక్ష పెట్టుబడి పెడితే రోజుకు రూ.1350 ఖాతాల్లో వేస్తారని అన్నాడు. ఆశతో రూ.లక్ష పెట్టుబడి పెట్టమని సదరు ఉపాధ్యాయుడికి ఇచ్చాను. ఆన్‌లైన్‌లో ఐడీ తయారు చేసిచ్చాడు. రోజువారీగా పడే డబ్బులు చూసుకోవచ్చని, నెలకు ఒకసారి ఆ డబ్బులు ఖాతాలో జమ అవుతాయని అన్నాడు. నేను కట్టిన ఐదు నెలలకు కంపెనీ ఎత్తేశారు. ఇంకా రూ.70వేలు రావాల్సి ఉంది. నాతోపాటు మరో ఇద్దరు కట్టారు. వారికి చాలా డబ్బులు రావాల్సి ఉంది. ఇప్పుడు ఆ ఉపాధ్యాయుడు చేతులెత్తేస్తున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తాను..." ఇదీ మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన ఓ సామాన్యుడి ఆవేదన.

"మాది కవ్వాల్ నేను ఓ ఉపాధ్యాయుడి మాట నమ్మి రూ.లక్ష పెట్టుబడి పెట్టాను. నేను ఇచ్చిన రెండు నెలలకే కంపెనీ మూతపడి యజమాని అరెస్ట య్యాడు. డబ్బుల విషయమై నిలదీస్తే నేనేమి చేయాలని ఉపాధ్యాయుడు చేతులెత్తేస్తున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తాను.." ఇదీ మరో వ్యక్తి వేదన.

జన్నారం: పెట్టుబడి రెట్టింపు అవుతుందనే ఆశతో సర్కారు ఉపాధ్యాయుల మాటలు నమ్మి మోసపోయారు. మూడేళ్లుగా సాగుతున్న ఈ వ్యవహారంలో మంచిర్యాల జిల్లా జన్నారం మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు, వ్యాపారులు, సామాన్యులు పెట్టుబడి పెట్టారు. సుమారు 60 మంది రూ.8కోట్ల వరకు కంపెనీ యాజమానికి చెల్లించినట్లు తెలుస్తోంది. ఈ తతంగం నడిపించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి చర్లపల్లి జైలుకు తరలించగా.. బాధితుల ఆందోళనతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తికి పలు రకాల కంపెనీలు ఉన్నాయి. తెలంగాణలోని ఆలెరు, జనగామతోపాటు మరికొన్ని ప్రాంతల్లో భూముల కొనుగోలుపై పెట్టుబడి కోసం వెబ్‌సైట్ ప్రారంభించాడు. పెట్టుబడి పెట్టిన వారికి లాభంతోపాటు ష్యూరిటీగా ఒక ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసిస్తానని ఆశ చూపాడు. పెట్టుబడి 150రోజుల్లో డబుల్ అవుతుందని, పూర్తి డబ్బులు ముట్టాక రిజిస్ట్రేషన్ చేసిన ప్లాటును తిరిగి యజమాని పేరిట రిజిస్ట్రేషన్ చేసివ్వాలని ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. పెట్టుబడి విలువ ప్రకారం ఐడీ వ్యాలెట్‌లో రోజువారీగా డబ్బులు జమ అవుతాయని, దీంతోపాటు రూ.లక్షకు రోజుకు రూ.1350 చొప్పున వ్యాలెట్‌లో జమ చేస్తామని నమ్మించాడు. ఆశపడ్డ కొందరు రూ.లక్ష నుంచి రూ.15లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ఓ ఉద్యోగి బినామీలు, కుటుంబ సభ్యుల పేర్లతో సుమారు రూ.70లక్షలు కంపెనీ యజమానికి ఇచ్చినట్లు తెలిసింది. తన స్నేహితుల ద్వారా మరో రూ.50లక్షల వరకు పెట్టుబడి పెట్టించినట్లు తెలుస్తోంది.

మండలంలో రూ.8 కోట్లకు పైగా
జిల్లాలోని దండేపల్లి మండలానికి చెందిన వ్యక్తి ఈ కంపెనీ, లావాదేవీలను జన్నారం మండలంలో పరిచయం చేశాడు. తన బంధువైన ఓ ఉపాధ్యాయుడు ఇందులో రూ.15లక్షలు పెట్టుబడి పెట్టగా.. ఆయన పేరిట ప్లాటు రిజిస్ట్రేషన్ చేసి నెలనెలా డబ్బులు ఖాతాలో వేశారు. ఈ విషయం మరికొందరు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లగా వారూ పెట్టుబడి పెట్టారు. ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు సాగాయి. మూడేళ్లుగా గుట్టుగా సాగుతున్న ఈ వ్యవహారం ఏడాదిగా చురుగ్గా సాగుతోంది. జన్నారం మండలంలో 50మందికి పైగా ఉద్యోగులు, వ్యాపారులు సుమారు రూ.8కోట్ల వరకు పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది. కంపెనీలో ఇతరులను చేర్పిస్తే వారికి 10శాతం ఇస్తారని పేర్కొనడం, రోజువారీగా వ్యాలెట్‌లో డబ్బు కనిపించడం, కొందరి ఖాతాల్లో జమ కావడంతో మరికొందరు అప్పు తెచ్చి మరీ పెట్టుబడి పెట్టినట్లు తెలిసింది. ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టి ఇంకా కొందరిని చేర్పించిన ఇద్దరికి కంపెనీ నుంచి వాహనాలు బహుమతిగా ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.



జైలుకెళ్లడంతో వెలుగులోకి..
కంపెనీ యజమానిని నవంబర్ 9న పోలీసులు అరెస్ట్ చేసి చర్లపల్లి జైలుకు తరలించినట్లు తెలిసింది. దీంతో పెట్టుబడి పెట్టిన వ్యక్తులు ఆందోళనకు గురై స్కీంను పరిచయం చేసిన వ్యక్తిని సంప్రదించారు. కొందరు వ్యక్తులు నవంబర్ 30న జైలుకు వెళ్లి అతడిని కలిసినట్లు తెలిసింది. జైలు నుంచి బయటకు రాగానే ఎవ్వరి డబ్బులు వారికి ఇస్తామని హామీనిచ్చినట్లు తెలిసింది. ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడంతో ఒక్కొక్కరు బయటకు వస్తున్నారు. పెట్టుబడి పెట్టిచ్చిన వారిని నిలదీస్తున్నారు. పోలీసులను ఆశ్రయించేందుకు కొందరు సిద్ధమవుతున్నారు.

బోర్డు తిప్పేసిన కంపెనీ

- అధిక వడ్డీకి ఆశపడి మోసపోయిన బాధితులు
- జిల్లాలో రూ.5కోట్లకు పైగా వసూళ్లు
- మూడు నెలలుగా వడ్డీ చెల్లించకపోవడంతో అనుమానం
- హైదరాబాద్‌లో కార్యాలయం మూసివేత
- ఆందోళనలో 500మందికి పైగా బాధితులు

జైపూర్: అందరికీ తెలిసిన వ్యక్తి.. పెద్ద కుటుంబం.. చిన్న వయస్సులోనే స్వతహాగా కంపెనీ స్థాపించి అనతికాలంలోనే ఆశించిన స్థాయి కంటే ఎక్కువగా ఎదిగాడు. స్నేహితుల, బంధువులు, పరిచయం ఉన్న వ్యక్తుల నుంచి అధిక వడ్డీకి డబ్బులు తీసుకుని కొంతకాలం వడ్డీ చెల్లించాడు. మూడు నెలలుగా కార్యాలయం బోర్డు తిప్పేసి అదృశ్యమయ్యాడు. డబ్బులు ఇచ్చిన వాళ్లంతా లబోదిబోమంటున్నారు. బాధితుల కథనం ప్రకారం.. మండంలోని రామారావుపేటకు చెందిన గుండా సురేష్ సీఏ చదివాడు. మంచిర్యాలలో నివాసం ఉంటుండగా.. ఎనిమిదేళ్ల క్రితం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో అంకుర కార్పొరేషన్ సొల్యూషన్స్ అనే కంపెనీ స్థాపించాడు. షేర్‌మార్కెట్‌లో లాభాలు ఆర్జించి రెట్టింపు చేసేందుకు తనకు తెలిసిన బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల నుంచి ఎక్కువ వడ్డీ(3నుంచి 10శాతం వరకు) ఇచ్చే విధంగా చెక్కులు ఇస్తూ రూ.లక్షల్లో తీసుకున్నాడు. రూ.కోట్లలో షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి నాలుగేళ్లుగా రూ.కోట్లలో వడ్డీలు చెల్లిస్తూ వచ్చాడు. అతడి దర్జా, వాడుతున్న కారు, హైదరాబాద్‌లో కార్యాలయం చూసి ఒక్కొక్కరు రూ.10లక్షల నుంచి రూ.50లక్షలకు పైగా డబ్బులు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఒక్క మంచిర్యాల జిల్లాలోనే రూ.5కోట్లకు పైగా తీసుకోగా, రాష్ట్ర వ్యాప్తంగా రూ.50కోట్లకు పైగా తీసుకున్నట్లు తెలుస్తోంది. నెలనెలా వడ్డీ డబ్బులు చెల్లించడంతో ఎక్కువ వడ్డీకి ఆశపడి జైపూర్ మండలం రామారావుపేట, ఇందారం, టేకుమట్లతోపాటు మంచిర్యాల, వరంగల్, హైదరాబాద్‌కు చెందిన అనేక మంది ప్రైవేటు కంపెనీల్లో పని చేస్తున్న వారు, వారి బంధువులు, స్నేహితులు రూ.లక్షలు సురేష్ చేతిలో పెట్టారు. మూడు నెలలుగా వడ్డీ చెల్లించకపోవడం, రూ.60లక్షల విలువైన కారు కనిపించకపోవడంతో బాధితులు ఆరా తీశారు. దీంతో ఈ నెల 7నుంచి అతడు కనిపించకుండా పోవడంతో జిల్లాతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బాధితుల్లో ఆందోళన నెలకొంది. తన స్నేహితులకు ప్రైవేటు బ్యాంకుల్లో రుణాలు ఇప్పించి ఆ డబ్బులు తీసుకున్నట్లుగా వాపోతున్నారు. సురేష్ ఆ డబ్బంతా ఏం చేశాడు.. షేర్‌మార్కెట్‌లో నష్టపోయాడా.. అని బాధితులు తల పట్టుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 500మంది బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్, వరంగల్ ప్రాంతాల్లో బాధితులు ఠాణాల్లో ఫిర్యాదు చేసినట్లుగా తెలుస్తోంది.

మెరుగైన వైద్యం అందించాలి



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకిస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు, అధికారులు

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు
- వైద్యాధికారులతో సమీక్ష

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చడంతోపాటు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మంగళవారం సాయంత్రం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, డైరెక్టర్ ఆఫ్ హెల్త్, డీఎంఈ విభాగాలకు చెందిన అధికారులు, వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సహకారం అందేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటానని, ప్రజలకు మెరుగైన వైద్యం అందే విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులపై ఉందని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుధ్యం మెరుగపడేలా చర్యలు తీసుకోవాలని, పది రోజుల్లో తాను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని చెప్పారు. సుదూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చే వారికి అన్ని రకాల సేవలు, చికిత్స అందించి, ప్రజలకు నమ్మకం కల్పించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను అధికారులు ప్రదర్శించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సులేమాన్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు, కమ్యూనిటీ హెల్త్ ఆసుపత్రుల సూపరింటెండెంట్ డాక్టర్ అరవింద్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్రరెడ్డి, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, సీనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యతను పెంపొందించాలి

- రాష్ట్ర విద్యాశాఖ ఆర్‌జేడీ రాజీవ్

జైపూర్: విద్యార్థుల్లో నైపుణ్యతను పెంపొందించాలని రాష్ట్ర విద్యాశాఖ రీజినల్ జేడీ రాజీవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముదిగుంట, ఇందారం, జైపూర్ స్కూల్ కాంప్లెక్స్‌ల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించడానికి ఎఫ్ఎల్ఎన్(ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసి) ఉన్నత పాఠశాలల్లో ఉన్నతి లక్ష్య కార్యక్రమాలను విద్యాశాఖ తరపున రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని, ఈ కార్యక్రమంలో రాష్ట్రం ముందుండేలా ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో తెలుగు, అంగ్ల భాష నైపుణ్యాల పెంపుదలకు లైబ్రేరీల సహకారంతో ఏ విధంగా ఉపయుక్తరంగా ఉంటుందో రూల్ టు రీడ్ వాలంటీర్ బోధిస్తుండగా పరిశీలించి పలు సూచనలు చేశారు. పాఠ్యపుస్తకాలతోపాటు వర్క్‌బుక్ హ్యాండ్ బుక్ సమన్వయం చేస్తూ పాఠ్యలు బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రశాంత్, జిల్లా విద్యాశాఖ అధికారి యాదవయ్య, క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, జైపూర్, ఇందారం, ముదిగుంట స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆలీస్ మాధుర్య, శ్రీనివాస్, రాజగోపాల్ పాల్గొన్నారు.



జైపూర్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ ఆర్‌జేడీ రాజీవ్

పాఠశాల తనిఖీ
భీమారం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను విద్యాశాఖ రీజనల్ డైరక్టర్ రాజీవ్ మంగళవారం తనిఖీ చేశారు. పదో తరగతిలో బోధన, కార్యాలయంలో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

నాణ్యమైన విద్య అందించాలి
భీమారం: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని విద్యాశాఖ మంచిర్యాల సెక్టోరియల్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల నోడల్ ఆఫీసర్ సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.

సింగరేణి 'చేతి'కి చిక్కేనా..!

- 25ఏళ్లలో ఒకేసారి ఐఎన్టీయూసీ గెలుపు
- ఈసారి 'గుర్తింపు' పోరు ప్రతిష్టాత్మకం
- నెలకే బలపరీక్ష.. రంగంలోకి పార్టీ హైకమాండ్

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఈసారైనా గెలువాలని ఐఎన్టీయూసీ గట్టి ప్రయత్నాలు చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ అ ధికారంలో ఉండడం అనుబంధ సంఘమైన సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్(ఐఎన్టీయూసీ)కి కలిసి వచ్చే అంశంగా నాయకత్వం భావిస్తోంది. గత 25ఏళ్ల గుర్తింపు సంఘ కాలంలో ఒక్క పర్యాయమే ఐఎన్టీయూసీ అధికారం ద క్కించుకుంది. ఇప్పటివరకు ఆరుసార్లు గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. 2003లో మూడో దఫా ఎన్నికల్లో మాత్రమే గుర్తింపు సంఘంగా గెలిచింది. ఆ తర్వాత అధికారం కోల్పోయి 16ఏళ్లుగా ప్రతిపక్ష స్థానంలో ఉండి క్యాడర్‌ను కాపాడుకోవడానికి అపసోపాలు పడింది.

పార్టీకి బల పరీక్షే..

అసెంబ్లీ ఎన్నికలు జరిగిన నెల రోజుల్లోనే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు రావడం కాంగ్రెస్ పార్టీకి బలపరీక్షగా మారింది. సింగరేని విస్తరించిన ఆరు జిల్లాల పరిధిలోని 11అసెంబ్లీ స్థానాల్లో కార్మిక ఓటర్లు ప్రభావితం చేస్తారు. ఇటీవల ఒక్క ఆసిఫాబాద్ (బీఆర్ఎస్) మినహా మిగతా పది చోట్ల కాంగెస్ పార్టీ గెలుపొందింది. ప్రస్తుతం వీటి పరిధిలోని 11 ఏరియాల్లో గుర్తింపు సంఘం ఎన్నికల్లో అనుబంధ కార్మిక సంఘం ఐఎన్టీయూసీని గెలిపించుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ నాయకత్వంపై పడింది. ఈ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వస్తే ప్రతిపక్షాలకు ఆయుధమవుతుందని పార్టీ నేతలు భావిస్తున్నారు. తెలంగాణకు గుండెకాయ లాంటి సింగరేణిలో మరో సంఘం అధికారంలో ఉంటే రాబోయే ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇబ్బందికర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని భావిస్తున్న పార్టీ.. గెలుపు బాధ్యతలను ఎమ్మెల్యేలకు అప్పగించడానికి నాయకత్వం సిద్ధమైనట్లు తెలిసింది.



అసెంబ్లీ సమావేశాల తర్వాత ప్రచారంలోకి..

ఈ నెల 14నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఆ సమావేశాల తర్వాత ఎక్కడి ఎమ్మెల్యేలు అక్కడే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్ తెలిపారు. ఈ నెల 20న శ్రీరాంపూర్‌లో జరిగే సమావేశానికి ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు బీ.సంజీవరెడ్డి రానున్నారు. ఈ సమావేశంలో కోల్‌బెల్ట్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొననున్నారు. కాగా, ఇప్పటికే గోదావరిఖనిలో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌ఠాకూర్, భూపాలపల్లిలో గండ్ర సత్యనారాయణరావు గేట్‌మీటింగ్‌లతో ఎన్నికల ప్రచారంలో నిమగ్నం అయ్యారు. ఇటీవల శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గోదావరిఖనికి వచ్చిన రాహుల్‌గాంధీ ఇక్కడి కార్మికులతో సుమా రు 40 నిమిషాలపాటు ప్రత్యేకంగా మాట్లాడి పార్టీ అండ యూనియన్‌కు ఉంటుందనే సంకేతాలు ఇ చ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా గెలిచిన త ర్వాత సింగరేణి కార్మికులంతా కాంగ్రెస్‌కు పట్టం కట్టారంటూ కొనియాడడంతో మరింత బలాన్నిచ్చింది.

పొత్తు ప్రచారానికి తెర..

శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ పొత్తు ఉండడంతో ఆ ప్రభావం యూనియన్‌పై పడింది. ఈ గుర్తింపు ఎన్నికల్లో కూడా ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ కలిసి పని చేస్తాయని, ఐఎన్టీయూసీ తమకు మద్దతిస్తుందంటూ కొద్దిరోజులుగా ఏఐటీయూసీ నాయకులు విస్తృత ప్రచారం చేశారు. ఈ ప్రచారం కొంప ముంచే ప్రమాదం ఉందని గ్రహించిన ఐఎన్టీయూసీ నాయకత్వం వెంటనే దీన్ని ఖండిస్తూ గనులపై గేట్‌మీటింగ్‌లు నిర్వహించారు. క్యాడర్‌లో ఉన్న గందరగోళానికి తెరదించుతూ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామంటూ తేటతెల్లం చేసుకోవాల్సి వచ్చింది

గుర్తింపు సంఘం ఎన్నికల వివరాలు...

ఎన్నికల సంవత్సరం	గెలిచిన సంఘం (గుర్తింపు కాలం)
1998	ఏఐటీయూసీ(2 సం)
2001	ఏఐటీయూసీ(2 సం)
2003	ఐఎన్టీయూసీ(4 సం)
2007	ఏఐటీయూసీ(4 సం)
2012	టీబీజీకేఎస్(4 సం)
2017	టీబీజీకేఎస్(4 సం)

చేరికలు..

సుదీర్ఘకాలం తర్వాత అన్ని పరిస్థితులు అనుకూలించిన ఈ తరుణంలో గుర్తింపు ఎన్నికలను చేజార్చుకుంటే భవిష్యత్తులో మనుగడ ప్రశ్నార్థకమనే భయం నాయకుల్లో ఉంది. మొన్నటి వరకు బలమైన క్యాడర్‌ను కలిగి ఉన్న టీబీజీకేఎస్ నుంచి వలసలను ప్రోత్సహించి ఐఎన్టీయూసీలో చేర్చుకుంటున్నారు. టీబీజీకేఎస్ నుంచి పెద్ద సంఖ్యలో నేతలను చేర్చుకుని ఏఐటీయూసీని బలహీనపర్చవచ్చనే ఐఎన్టీయూసీ నేతలు భావిస్తున్నారు. ఏఐటీయూసీలోకి వలసలు వెళ్లకుండా తమవైపు తిప్పకుంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున తాము సింగరేణిలో గెలిస్తే కార్మికులకు రెండు గుంటల ఇంటి స్థలం ఇస్తామనే బలమైన హామీతో కార్మికుల ఓట్లను తమ వైపు మలుచుకొనే పనిలో ఉన్నారు. ఏదేమైనా ఈ ఎన్నికలు కాంగ్రెస్, ఐఎన్టీయూసీకి అగ్ని పరీక్షగానే మారాయి.

కొత్త సర్కారు పాత సాయమే..

- రైతుల ఖాతాల్లోకి నగదు
- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం

మంచిర్యాలఅగ్రికల్చర్: యాసంగి సీజన్ పంట సాగుకు పెట్టుబడి సాయం అందించేందుకు కొత్త సర్కారు ఆదేశాలు జారీ చేసింది. రైతుభరోసా విధి విధానాలు ఇంకా ఖరారు కాకపోవడంతో పాత పద్ధతిలోనే రైతుబంధు పథకం నిబంధన మేరకు ఎకరానికి రూ.5వేల చొప్పున జిల్లాలోని రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఏటా రూ.15వేలు అందిస్తామని హామీనిచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఆలస్యమైనా సాయం అందుతుండడంతో రైతులకు పెట్టుబడి అవసరాలు తీరనున్నాయి. విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు ఆర్థికంగా మేలు జరుగుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరిగానే సన్న, చిన్నకారు రైతుల ఖాతాల్లో మొదట జమ చేస్తూ విడతల వారీగా పదిహేను రోజుల్లో పూర్తి చేయనున్నారు. జిల్లాలో 1,49,760 మంది రైతులు ఉన్నారు. గత వానాకాలం సీజన్‌లో 1,39,195 మంది రైతులకు గాను రూ.164,59,26,925 జమ చేశారు. ఈ యాసంగిలో 1,47,547 మంది రైతులకు గాను రూ.169,75,71,801 వరకు అందనుంది. ఇటీవల కొత్తగా పట్టాలు వచ్చిన రైతులకు సాయం అందుతుందా లేదా అనేది స్పష్టత లేదని అధికారులు పేర్కొంటున్నారు. కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చిన రైతుల ఆధార్ నంబర్, బ్యాంక్ ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ తదితర వివరాల ఆధారంగా వ్యవసాయ శాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని, ప్రభుత్వ ఆదేశానుసారం యాసంగి సీజన్ అర్హులైన రైతులందరికీ రైతుబంధు పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయాధికారి జి.కల్పన తెలిపారు.

క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ వైస్ చైర్మన్



శ్రీనివాస్‌కు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే

నస్పూర్: నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్ కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం రాత్రి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు నివాసంలో జరిగిన కార్యక్రమంలో తోట శ్రీనివాస్‌కు పీఎస్సార్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో పట్టణ అభివృద్ధికి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కాగా శ్రీనివాస్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌ను వీడి బీఎస్పీ తరఫున మంచిర్యాల నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్ దంపతులు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని 10వ వార్డు కౌన్సిలర్ అసంపల్లి లావణ్య, నగేశ్ దంపతులు మంగళవారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు నల్ల శంకర్, వేములపల్లి సంజీవ్, నల్ల మహేశ్ పాల్గొన్నారు.

హత్య కేసులో మరో ఇద్దరు అరెస్ట్

భీమిని(బెల్లంపల్లి): మండలంలోని కేస్లాపూర్‌లో బొడ్డు జలేందర్‌ను హత్య చేసిన కేసులో మరో ఇద్దరు నిందితులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు బెల్లంపల్లి ఏసీపీ సదయ్య తెలిపారు. మొదటి నిందితుడు రాజశేఖర్ గౌడ్‌ను ఈ నెల 3న అరెస్ట్ చేయగా హత్యకు సహకరించిన మరో ఇద్దరు నిందితులు కేస్లాపూర్ గ్రామానికి చెందిన ముత్యం పురుషోత్తం గౌడ్, ఇందూరి రాజశేఖర్‌ను మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఆయన పేర్కొన్నారు. హత్యకు సహకరించిన మరికొందరి వివరాలు సేకరిస్తున్నామన్నారు.

గ్రామాల్లో అదనపు కలెక్టర్ సందర్శన



గ్యాస్‌ప్లాంటును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల, నంనూర్, దొనబండ, పెద్దంపేట గ్రామాల్లో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ ఆకస్మికంగా పర్యటించారు. పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణ, నర్సరీల్లో గోబర్ గ్యాస్‌ప్లాంట్ల నిర్మాణాలను పరిశీలించి పనులు పకడ్బందీగా జరగాలని సూచనలు చేశారు. సమీపంలోనే ప్లాంట్లు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఎంపీడీఓ అబ్దుల్‌హై, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రూ.10 కరెన్సీ నోట్ల కొరత..!



- మార్కెట్లో కనిపించని నోట్లు
- నాణేలు ఉన్నా చెల్లవంటూ వదంతులు
- వ్యాపారులు, ప్రజలకు చిల్లర కష్టాలు



మంచిర్యాలరూరల్(హాజీపూర్): మార్కెట్లో రూ.10 కరెన్సీ నోట్ల కొరత తీవ్ర సమస్యగా మారింది. ఎక్కడ రూ.20 నోటు ఇచ్చినా తిరిగి పది రూపాయలు ఇవ్వాలంటే లేదు అనే పరిస్థితి ఎదురవుతోంది. వ్యాపారులు, వీధి వ్యాపారులతోపాటు ఇటు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోంది. గతంలో పది రూపాయల నాణేలు చెల్లవనే గోల ఉండగా.. ఇప్పుడు నోట్ల కొరత కొత్త సమస్యలు తెచ్చి పెడుతోంది. 2017లో పది రూపాయల నాణేలు చెల్లవంటూ వదంతులు వ్యాపించాయి. దుకాణాలు, చిల్లర వ్యాపారులు, కూరగాయలు, ఇతర మార్కెట్లలో నాణేలు చెల్లవని తీసుకోవడానికి నిరాకరించారు. తక్కువ మంది నాణేలు తీసుకుంటుండగా.. చాలామంది తమ వద్ద ఉన్న నాణేలను బ్యాంకుల్లో అప్పగించి నోట్లతో మార్పిడి చేసుకున్నారు. ప్రస్తుతం పది రూపాయల నోట్ల చెలామణి తగ్గిందని వ్యాపారులు వాపోతున్నారు. ప్రతీ కొనుగోలు కార్యకలాపాలన్నీ తక్కువ విలువైన కరెన్సీ పదితో అనుసంధానంగా ఉంటున్నాయి. నోట్ల కొరతకు కారణం ఏమిటనేది ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు ఆటోలు, చిన్నపాటి కిరాణ, జనరల్, బేకరీ దుకాణాల్లోనే కాదు ప్రతీ చిన్న, పెద్ద వ్యాపారవర్గాలకు నోటు కొరత తీరని సమస్యగా మారింది. ఏమైనా కొనుగోలు చేయాలంటే చిల్లర సమస్య ఎదురవుతోంది. మరోవైపు కొనుగోలుదారుల నిలదీతతో వ్యాపారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చిన్న వ్యాపారులు ఏదో ఒక వస్తువు ఇచ్చేసి చేతులు దులిపేసుకుంటుండగా కొన్ని సందర్భాల్లో వ్యాపారుల వద్ద రూ.10 నోటు ఇవ్వాల్సిందేనంటూ వాదనలు చోటు చేసుకుంటున్నాయి.

చిల్లర వర్తకుల నుంచి ఇదే పరిస్థితి..

కూరగాయలు, పాలు, పండ్లు, ఆకుకూరలు, కిరాణ, టీ స్టాళ్లు, చిరు హోటళ్ల వద్ద రూ.10 నోట్ల కొరతతో నానా ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌లో చిల్లర కోసం తిరిగినా ఎవ్వరూ ఇవ్వలేని పరిస్థితి. ఇక పెట్రోల్ బంక్‌ల్లోనూ కొరత ఉంది. ప్రస్తుతం చాలామంది దగ్గర ఉన్న నోట్లు కూడా చిరిగి కనిపిస్తున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో కొరత ఉండగా ఇప్పుడు మహాలక్ష్మి పథకం కింద మహిళల ఉచిత ప్రయాణంతో కొంత తీరినట్లయింది. జేబులో ఉన్న రూ.20 నోటుతో టీ తాగినా, టిఫిన్ సెంటర్‌లో రూ.50 ఇచ్చినా తిరిగి రూ.10 నోటు తీసుకోవాలన్నా దొరకని ఇబ్బంది. చిరు వ్యాపారుల నుంచి పెద్ద వ్యాపారుల వరకు నోట్ల సమస్య ఎదుర్కొంటున్నారు. ప్రజలు, వ్యాపార వర్గాలు ఎదుర్కొంటున్న ఈ విపత్కర ఇబ్బందులకు పరిష్కారం చూపాల్సిన బ్యాంకు అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినవస్తున్నాయి. రూ.10 నోటు దొరకడం లేదని, నోటు తమ పాలిట చేటుగా మారిందని ఓ చిరు వ్యాపారి తెలిపాడు.

అవగాహన కల్పించాలి



ముందు రూ.10 నాణేలు చెల్లుతాయని అవగాహన కల్పించేలా చూడడంతోపాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు రూపొందించాలి. నాణేలా చెల్లుబాటుపై మార్కెట్లు, ప్రధాన కూడళ్లలో ప్రచార ఫ్లెక్సీలు, ఇతర ప్రకటనలతో అవగాహన కకల్పించాలి. నాణేలు చెల్లుతాయని చెప్పడం, రూ.నోట్ల కొరత తీర్చడం వంటి వాటిపై బ్యాంకు అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి. మార్కెట్‌లో ప్రస్తుతం నెలకొన్న రూ.10 నోటు చిల్లర సమస్య తీర్చేలా చూడాలి.

– కొండపర్తి ప్రభాకర్, బేకరీ నిర్వాహకుడు, మంచిర్యాల

మిర్చికి తెగులు... రైతుల్లో గుబులు



చెన్నూర్ గోదావరి ఒడ్డున మిర్చి తోట

- ముడుచుకు పోతున్న ఆకులు
- పూత, కాత రాలుతున్న వైనం

చెన్నూర్: మిర్చి పంటకు తెగుళ్లు సోకుతున్నాయి. ప్రస్తుతం చెట్లు పూత, కాత దశలో ఉన్నాయి. పంటకు తెగుళ్లు సోకడంతో ఆకులు ముడుచుకుని మొక్కల పెరుగుదల తగ్గింది. అంతేకాకుండా పూత, కాత రాలిపోతోంది. పంటను కాపాడుకునేందుకు వివిధ రకాల మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో 1,379 ఎకరాల్లో సాగు ..

మంచిర్యాల జిల్లాలో ఈ ఏడాది 625 మంది రైతులు 1,379 ఎకరాల విస్తీర్ణంలో మిర్చి పంట సాగు చేశారు. గతేడాది మిర్చి పంటకు రికార్డు స్థాయిలో ధర పలికింది. క్వింటాలు మిర్చి ధర రూ.26 వేల నుంచి రూ.35 వేల ధర పలికింది. రైతులు లాభాల బాట పట్టారు. గతేడాది మంచి లాభాలు రావడంతో ఈ ఏడాది మిర్చి సాగు రెట్టింపైంది. వాణిజ్య పంట అయిన మిర్చి సాగుకు పెట్టుబడి రెట్టింపు అవుతుంది. ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి అవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

వాతావరణంలో మార్పులతో...

వారం రోజులుగా వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో మిర్చి పంటకు తెగుళ్లు సోకుతున్నాయి. మిచాంగ్ తుపాన్ ఎఫెక్ట్‌తో చలి తీవ్రత పెరిగింది. చలి పెరగడంతో వివిధ రకాల తెగుళ్ల వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయని రైతులు అంటున్నారు. ఉద్యానవన శాఖ అధికారులు పంటలను పరిశీలించి సలహాలు, సూచనలు అందించాలని మిర్చి రైతులు కోరుతున్నారు.

పంటను పరిశీలించాలి



ఎకరాకు రూ.25 వేలతో ఐదెకరాలు కౌలుకు తీసుకుని అందులో మిర్చి పంట సాగు చేశా. పంట పూత, కాత దశలో పంటకు తెగుళ్లు సోకడంతో ఏం చేయాలో తోచడం లేదు. వివిధ రకాల మందులు పిచికారీ చేస్తున్నా రోగం తగ్గడం లేదు. అధికారులు పంటను పరిశీలించి సరైన మందులు సూచించాలి. లేదంటే రైతులు నష్టపోవాల్సి వస్తుంది.

– ఎన్నపురెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మిర్చి రైతు

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

మిర్చి పంటకు తెగుళ్లు సోకుతున్న విషయం ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. వెంటనే పంటలను పరిశీలిస్తాం. మిర్చి పంటకు సోకిన వైరస్‌ను గుర్తించి నివారణకు మందులు సూచిస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– తిరుపతి, హెచ్‌వో

ఏడీఏపై బిల్లు పత్రాలు విసిరికొట్టిన ఎస్టీవో

- నేలపై కూర్చుని నిరసన తెలిపిన బాధితురాలు సురేఖ



నిరసన తెలుపుతున్న ఏడీఏ సురేఖ

బెల్లంపల్లి: వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది వేతనాల బిల్లు పాస్ చేయాలని అడిగిన ఏడీఏపై ఎస్టీవో పత్రాలు విసిరికొట్టిన సంఘటన మంగళవారం బెల్లంపల్లి సబ్ ట్రెజరరీ కార్యాలయంలో చోటు చేసుకుంది. బాధితురాలు సురేఖ తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో 12 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. గత నెల 20న వారి వేతనాల బిల్లును ఏటీవో సంధ్యకు అందజేయగా 25న ఏటీవో తిరస్కరించారు. అదేరోజు మళ్లీ బిల్లు ఇస్తే తీసుకోకుండా డిసెంబర్ 3న ఇవ్వాలని సూచించడంతో ఆ ప్రకారమే ఏడీఏ అందజేశారు. ఇప్పటి వరకు బిల్లు పాస్ కాకపోవడంతో ఏడీఏ స్వయంగా సబ్‌ట్రెజరరీ కార్యాలయానికి వెళ్లి జీతాలు రాక సిబ్బంది చాలా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బిల్లు పాస్ చేయాలని కోరడంతో ఎస్టీవో గీత తన వద్ద ఉన్న బిల్లు పత్రాలు ముఖంపై విసిరేసారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సురేఖ కార్యాలయంలో నేలపై కూర్చుని నిరసన తెలిపారు. అప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మీడియాను రప్పిస్తానని చెప్పడంతో బిల్లు పాస్ చేశారని బాధితురాలు వివరించారు. మహిళా ప్రభుత్వ అధికారి అయి ఉండి తోటి మహిళా అధికారిపై బిల్లు పత్రాలు విసిరేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

కాసిపేట: చోరీ కేసులో మండలంలోని దేవాపూర్‌కు చెందిన షేక్ మహబూబ్, సామ రాకేష్‌లకు కోర్టు మంగళవారం ఐదు నెలల సాధారణ జైలుశిక్ష విధించినట్లు దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపారు. దేవాపూర్‌కు చెందిన పెంద్రం చందు ఇంట్లో 2018, మే 14న చోరీ జరిగింది. ఈ విషయమై అప్పటి ఎస్సై టి.శ్రీకాంత్ కేసు నమోదు చేశారు. బెల్లంపల్లి జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముకేష్ సాక్ష్యాధారాలను పరిశీలించి నేరం రుజువు కావడంతో జైలుశిక్ష విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

లెక్చరర్‌పై కేసు నమోదు

బెజ్జూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. నకిలీ పీజీ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందాడని ప్రిన్సిపాల్ రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

అనుమానాస్పదంగా యువకుడు మృతి

బెల్లంపల్లి: పట్టణంలోని కన్నాల పాత రైల్వే గేట్ వద్ద రైలు పట్టాలపై మంగళవారం ఓ యువకుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించినట్లు బెల్లంపల్లి జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి తెలిపారు. టేకులబస్తీకి చెందిన టాంక్ విమల్ సింగ్ (24) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతదేహంపై తీవ్ర గాయాలున్నాయి. మృతుని తండ్రి ఆలంసింగ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

మెడికల్ కార్డుకు 31 తుదిగడువు

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన మాజీ ఉద్యోగులు ఈ నెల 31లోగా మెడికల్ కార్డు (సీపీఆర్ఎంఎస్) కొరకు దరఖాస్తు చేసుకోవాలని శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) అరవింద్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు ఎవరైనా ఉంటే వారు పనిచేసిన గనులపై కార్యాలయాల వద్ద దరఖాస్తులు అందజేయాలని ఆయన సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: క్రిస్మస్‌ను పురస్కరించుకుని విద్య, వైద్యం, సాహిత్యం, కళలు, క్రీడారంగాల్లో ఉత్తమ సేవ, ప్రతిభ కనబర్చిన క్రైస్తవులు, సంస్థలను ప్రభుత్వం సత్కరించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా రంగాలలో 30 ఏళ్లకు పైబడి ఉత్తమ సేవ, ప్రతిభ కనబరిచిన వ్యక్తులు, సంస్థలు నామినేషన్ ఫారాలను మేనేజింగ్ డైరెక్టర్, తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ(మైనారిటీ) ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో పొందవచ్చన్నారు. పూర్తి చేసిన నామినేషన్లను ఈ నెల 13 నుంచి 15 వ తేదీలోగా సమర్పించాలని సూచించారు.

సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

- ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జీ.జనక్‌ప్రసాద్



యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్: సింగరేణిలో ఐఎన్టీయూసీ గుర్తింపు సంఘంగా గెలిస్తే ప్రైవేటీకరణను అడ్డుకుంటామని ఆయూనియన్ సెక్రటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆర్కే 6 గని, సీహెచ్‌పీలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి గనులను ప్రైవేటీకరణ చేసే కుట్ర జరుగుతోందని, దీన్ని అడ్డుకోవాలంటే ఐఎన్టీయూసీతోనే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా సుమారు 300 మంది కార్మికులు ఐఎన్టీయూసీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు కాంపెల్లి సమ్మయ్య, కలవేని శ్యామ్, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, నాయకులు భీంరావు, సమ్మిరెడ్డి, కొలిపాక సమ్మయ్య, చంద్రమోహన్, వెంకటస్వామి, రమేశ్, ఆకుల రాజయ్య, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘భూగర్భ గనులు తీసుకొస్తాం’



మాట్లాడుతున్న తిప్పారపు సారయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో గుర్తింపు సంఘంగా హెచ్ఎంఎస్‌ను గెలిపిస్తే కొత్తగా భూగర్భ గనులను తీసుకొస్తామని యూనియన్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య అన్నారు. మంగళవారం ఎస్సార్పీ 3, 3ఏ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఇప్పటి వరకు ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్‌లను గెలిపించారని, వారివల్ల 1,20,000 మంది ఉన్న కార్మికులు నేడు 39 వేలకు చేరారని గుర్తు చేశారు. పర్మినెంట్ ఉద్యోగాలు పోయాయని, ప్రైవేటీకరణ పెరిగిందని, భూగర్భ గనులు మూతపడ్డాయన్నారు. సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి అనిల్‌రెడ్డి, నాయకులు ఎం.కొమురయ్య, దుర్గం లక్ష్మణ్, కంబాల నరసయ్య, దుర్గం వెంకటేష్ పాల్గొన్నారు.

‘దళిత దెబ్బ’కు అనుమతి ఇవ్వొద్దు



ఫిర్యాదు కాపీతో ఆదివాసీ నాయకులు

ఆసిఫాబాద్: నార్నూర్ మండల కేంద్రంలో దళిత జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన దళిత దెబ్బ కార్యక్రమానికి అనుమతి ఇవ్వవద్దని ఆదివాసీ సంఘాల నాయకులు మంగళవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. 5వ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతమైన నార్నూర్‌లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా చేపడుతున్న నిరసన కార్యక్రమాన్ని తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. కార్యక్రమం ఆదివాసీల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని, దీనివల్ల ఏజెన్సీలో గిరిజనులు, గిరిజనేతరుల మధ్య తీవ్ర ఘర్షణలు చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు గేడం కైలాస్, నైతం అరవింద్, శివశంకర్, బండి రామన్న ఉన్నారు.

‘అక్రమ ఎస్టీ ఓటును తొలగించాలి’



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాసిపేట: మండలంలోని ధర్మరావుపేటలో ఎస్టీ ఓటర్లు లేరని, అక్రమంగా నమోదు చేసుకున్న వారి ఓటును తొలగించాలని మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ భోజన్నకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఒక్క ఎస్టీ కూడా లేనప్పటికీ ఎస్టీ రిజర్వేషన్ ఉండటంతో గత సర్పంచ్ ఎన్నికలు బహిష్కరించడంతో పాలకవర్గం లేకుండా పోయిందన్నారు. లంబాడితండాకు చెందిన వ్యక్తి మూడునెలల క్రితం ఓటరుగా నమోదు చేసుకోవడమే కాకుండా గ్రామంలో ఇంటినిర్మాణం కూడా చేపడుతున్నాడన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్, రాజమౌళి, తిరుపతిరెడ్డి, కుమార్, సిలివేరి కుమార్, శంకర్ పాల్గొన్నారు.

‘ఐఎన్టీయూసీతోనే హక్కుల పరిరక్షణ’



మేనిఫెస్టో విడుదల చేస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఐఎన్టీయూసీతోనే సింగరేణి కార్మికుల హక్కులకు రక్షణ ఉంటుందని యూనియన్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు సిద్దంశెట్టి రాజమౌళి అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో మంగళవారం మేనిఫెస్టో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ సహకారంతో సింగరేణి కార్మికులకు అనేక హక్కులు సాధిస్తామన్నారు. సింగరేణి కార్మికులకు ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. గత ఎన్నికల్లో గుర్తింపు సంఘంగా ఎన్నికైన టీబీజీకేఎస్ పూర్తిగా యాజమాన్యానికి తొత్తుగా మారి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో టీబీజీకేఎస్ విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధ్యక్షుడు పేరం శ్రీనివాస్, నాయకులు మాధవకృష్ణ, సంజీవరెడ్డి, అదిగొప్పుల స్వామి, దామెర సదానందం, జీపీ చంద్రకుమార్, సంతోష్, చిన్నయ్య, భాస్కర్, తిరుపతి, అబ్బాస్, ప్రవీణ్‌కుమార్, కుమార్, ప్రభాకర్, వీరస్వామి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

‘అవినీతి సొమ్ము వెలికితీయాలి’



నిరసన తెలుపుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: జార్ఖండ్ రాష్ట్రంలోని కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహూ తన కార్యాలయంలో దాచిన రూ.500 కోట్లను కేంద్ర ఐటీ, ఇంటలిజెన్స్ అధికారులు స్వాధీనం చేసుకోవడం కాంగ్రెస్ పార్టీ నేతల అవినీతి బాగోతాలను బట్టబయలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆరుముళ్ల పోషం అన్నారు. పట్టణంలోని సూపర్‌బజార్‌లో మంగళవారం కాంగ్రెస్ నేతల అవినీతిపై నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. దేశంలో అధికారంలోకి రావటానికి కాంగ్రెస్ పార్టీ అవినీతి సొమ్మును వినియోగిస్తూ అడ్డదారులు తొక్కుతోందన్నారు. కేంద్ర ఐటీ శాఖ ఇలాంటి సొమ్మును మరింతగా వెలికితీయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జి వేముల అశోక్, మాసు సత్యనారాయణ, ధన్‌సింగ్, ముద్దసాని శ్రీనివాస్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

‘ఎవరూ సాధించని హక్కులు సాధించాం’



మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణిలో ఎవరూ సాధించలేని హక్కులను టీబీజీకేఎస్ సాధించిందని ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తమ గుర్తింపు సంఘం హయాంలో 60కు పైగా హక్కులు సాధించామని, సింగరేణి చరిత్రలో ఇదో రికార్డ్ అన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ గుర్తింపు సంఘంగా ఉన్న కాలంలో ఉన్న హక్కులను పోగొట్టాయన్నారు. కార్మికులకు మేలు చేసింది టీబీజీకేఎస్ మాత్రమేనని, మరోమారు గెలిపించాలని కోరారు. సమావేశంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు డీ.అన్నయ్య, కేంద్ర కమిటీ నాయకుడు ఏనుగు రవీందర్‌రెడ్డి, బ్రాంచ్ కమిటీ నాయకులు వెంగళ కుమారస్వామి, పెట్టం లక్ష్మణ్, వెంకటరెడ్డి, నాయకులు అంజద్ పాషా, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



గోదావరి తీరం వద్ద పరిశీలిస్తున్న రఘునాథ్

దండేపల్లి: మండలంలోని గూడెం గోదావరి నదీ తీరం వద్ద పుణ్యస్నానాలు చేసేందుకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ డిమాండ్‌చేశారు. పార్టీ నాయకులతో కలిసి మంగళవారం ఆయన గోదావరి తీరాన్ని పరిశీలించారు. జాతీయ రహదారి పక్కన గోదావరి తీరం ఉండటంతో పాటు, సమీపంలో గుట్టపైన సత్యనారాయణ స్వామి, అయ్యప్ప, షిర్డిసాయి బాబా ఆలయాలు కూడా ఉన్నాయి. దీంతో గూడెం గోదావరి తీరానికి నిత్యం భక్తులు స్నానాలు ఆచరించేందుకు వస్తుంటారు. ఇలాంటి సమయంలో భక్తులు స్నానాలు చేసేందుకు కనీస వసతులు కల్పించక పోవడం దారుణమన్నారు. కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు.

మహిళా సాధికారతకు ‘హబ్’



మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ సౌజన్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బాలికలు, మహిళల సంరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం మహిళా సాధికారత హబ్ పనిచేస్తోందని మహిళా సాధికారత హబ్ జిల్లా కో ఆర్డినేటర్ సౌజన్య అన్నారు. మంగళవారం హాజీపూర్ మండలం గుడిపేటలోని మహాత్మ జ్యోతిబాపూలే, గుడిపేట, నంనూర్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో హబ్ జెండర్ స్పెషలిస్ట్ మౌనిక, విజయలతో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా సంక్షేమాధికారి ఆదేశాల మేరకు మహిళా సాధికారత హబ్ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమాల్లో బాలికలు, మహిళల సంరక్షణ కొరకు చేపట్టిన కార్యక్రమాలు, మహిళా చట్టాలపై అవగాహన కలిపిస్తున్నామన్నారు.